క్లుప్తంగా

యువత అన్ని రంగాల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్

చింతూరు: యువత అన్ని రంగాల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతూరులో నిర్వహిస్తున్న వాలీబాల్, ఆర్చరీ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రావీణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ కుటుంబాల అభివృద్ధికి పాటు పడాలని ఆయన సూచించారు. ట్రస్ట్ సభ్యులు రియాజ్, షాజహాన్, విక్కీ, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

మారేడుమిల్లి: సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాల విడుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని మారేడుమిల్లి మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లె అనిల్‌కుమార్(బాబి) కోరారు. కుట్రవాడ గ్రామం నుంచి సత్యసాయి వాటర్ స్కీమ్ ద్వారా 250 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. కార్మికులకు 22 నెలలుగా జీతాలు లేవన్నారు. కార్మికులు అప్పులు తెచ్చుకుని, వడ్డీలు కట్టలేకపోతున్నారన్నారు. తప్పని పరిస్థితిలో ఆందోళనకు సిద్ధమవుతున్నారన్నారు. కార్మికులు సమ్మె చేయడం వలన అనేక గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్రాంతి పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందించిన నిర్వాహకులు

గూడెంకొత్తవీధి: సంక్రాంతి సందర్భంగా గ్రామంలో నిర్వహించిన వివిధ రకాల సంప్రదాయ పోటీల్లో విజేతలకు శనివారం రంపుల గ్రామంలో నిర్వహకులు బహుమతులను అందజేశారు. ఇందులో భాగంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలు, వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ఇచ్చారు. నిర్వాహకులు నరేష్, చిన్నబ్బాయి బాలరాజు, రాజుబాబు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పాడేరు రూరల్/కొయ్యూరు/చింతపల్లి/ముంచంగిపుట్టు/రాజవొమ్మంగి/గంగవరం: దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.టి.రామారావు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు చీరలు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎన్.టి.రామారావు చేసిన సేవలను పలువురు కొనియాడారు. టీడీపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బాబూరావు మృతికి సంతాపం



డాక్టర్ బాబూరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గంగవరం : గంగవరం మండలం జగ్గంపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కారం బాపన్న దొర తనయుడు డాక్టర్ కారం బాబూరావు (80) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన జగ్గంపాలెం గ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య, రిటైర్డ్ డీఎస్పీ మాడే రాములు తదితరులు హాజరయ్యాయి. సర్పంచ్ లీలావతి, ఎంపీటీసీ పద్మావతి, టీడీపీ నాయకుడు సురేష్‌బాబు, ఆదివాసీ నాయకులు అనిల్, శ్రీను , కోసం అనిల్ తదితరులు సంతాపం తెలిపారు.



ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

వాహనాలకు తుప్పు.. ఎవరిది తప్పు



తుప్పల్లో వాహనాలు



తుప్పు పడుతున్న వాహనాలు



సీజ్ చేసిన కార్లు, జీపులు

- పేరుకుపోతున్న సీజ్ చేసిన వాహనాలు
- పోలీసుస్టేషన్ ప్రాంగణంలో గుట్టలుగా బల్లు

ముంచంగిపుట్టు: రోడ్డు ప్రమాదాలు, గంజాయి అక్రమ రవాణా, దొంగతనాలు వంటి కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు పోలీసు స్టేషన్‌లో తుప్పు బట్టిపోతున్నాయి. మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు 80పైగా ఉన్నాయి.ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్ ఆవరణలో ఈ సీజ్ వాహనాలు దర్శనమిస్తున్నాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న చాలా వాహనాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. అందులో ఎక్కువ భాగం ద్విచక్ర వాహనాలు కాగా, కార్లు, ఆటోలు, జీపులు, బొలెరో పికప్ వాహనాలున్నాయి.పోలీసు స్టేషన్ ఆవరణంలో స్థలం సరిపోక పోవడంతో స్టేషన్ బయటకు సైతం వాహనాలు ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.

స్పందించని వాహన యజమానులు

సీజ్ చేసిన వాహనాల్లో కొన్నింటిని మాత్రం వాటి యజమానులు విడిచించుకుపోతుంటారు. అయితే చాలా వరకు ఏళ్ల తరబడి కేసులు పరిష్కారం కాని కారణంగా పోలీసు స్టేషన్‌లోనే వాహనాలు ఉండి పోతున్నాయి.కోర్టు ఆదేశాల తరువాత కూడా వాహనాలు విడిపించుకోవడానికి యజమానులు ముందుకు రావడం లేదు. ప్రమాదాలకు గురైన వాహనాలకు సంబంధించిన కేసుల్లో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. తమ బంధువులను కోల్పోయిన వ్యక్తులు వాహనాలు తిరిగి తీసుకెళ్లడానికి ఇష్టపడకపోవడంతో అవి పోలీసు స్టేషన్‌లోనే మగ్గుతున్నాయి. ప్రమాదవశాత్తూ లేదా ఇతర కారణాలతో సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలకు రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయాలి. అలా చేసిన వాహనాలు ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తే ప్రభుత్వానికి కొంత ఆదాయం వస్తుంది. కానీ ఆ దిశగా పోలీసు శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు చెబుతున్నారు. వాహనాలు స్టేషన్‌లోనే తుప్పుపట్టి ఎందుకూ పనికి రాకుండా పోతాయి.

కొనసాగుతున్న కేసులు



వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలిస్తుంటాం. వాహనంపై కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. సంవత్సరాలు గడిచే అవకాశం కూడా ఉంది. కోర్టు నుంచి ఆదేశాలు వస్తే సంబంధిత యజమానికి మూడుసార్లు నోటీసు ఇచ్చి అతను నుంచి ఎటువంటి స్పందన లేని పక్షనా వేలం వేసేందుకు ఆస్కారం ఉంది.

– జె.రామకృష్ణ, ఎస్ఐ, ముంచంగిపుట్టు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పి.యర్రగొండలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండలో ఏపీ గురుకుల గిరిజన బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష కేంద్రంలో 264 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 114 మంది హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని రంపచోడవరం డీఎస్పీ జి.సాయిప్రసాద్, తహసీల్దార్ పి.వేణుగోపాల్, ఎస్ఐ బి.రామకృష్ణ, ఎంఈవో తాతబ్బాయిదొర సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పరీక్షకు 12 మంది ఇన్విజిలేటర్లు పర్యవేక్షించినట్టు ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు.



అరకులోయ సీపీహెచ్ స్కూల్ గేటు వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు

అరకులోయటౌన్: అరకరులోయలో శనివారం నిర్వహించిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల(కంఠబౌంషుగుడ) రెండు సెంటర్లలో మొత్తం 335 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 247 మంది హాజరైనట్టు హెచ్ఎంలు ఎల్.బి.దయానిధి, మోహనరావు తెలిపారు.

చింతపల్లి: చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నవోదయ పరీక్షకు 172 మంది హాజరైనట్టు ఎంఈవో ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షకు 253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 172 మంది హాజరు కాగా 81 మంది గైర్హాజరైనట్టు చెప్పారు.

కూనవరం: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్లో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా మిగిసింది. ఈ పరీక్షకు 176 మంది విద్యార్థులకు గాను 106 మంది హాజరుకాగా, 70 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా హెచ్ఎం చిచ్చడి అప్పారావు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జిగా ఎంఈవో లక్ష్మీనారాయణ వ్యవహరించారు.



కూనవరం ఉన్నత పాఠశాలలో హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



అడ్డతీగలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

అడ్డతీగల : స్థానిక ఆశ్రమ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో నవోదయ ప్రవేశ పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ కొమరం సూర్యారావు, సీఐ నరసింహామూర్తి , ఎంఈవో పి.శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో 214 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

ఇన్‌చార్జి ఏవోగా మధుసూదనరావు

చింతపల్లి: చింతపల్లి ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా మధుసూదనరావు బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి మండల వ్యవసాయ అధికారిగా ఉన్న శ్రీనివాసరావు రెండు నెలలు పాటు శాఖాపరమైన శిక్షణకు వెళ్లడంతో ఆయన స్థానంలో జికే వీధి వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మధుసూదనరావుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు మధుసూదనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

రోలుగుంట: మండలంలోని కుసుర్లపూడిలో సర్పంచ్ మద్దు అప్పలనాయుడు ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. బాణసంచా కాలుస్తూ, సారెతో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. గ్రామ సమీపంలో గల చెరువులో నిమజ్జనం చేశారు.

రారండోయ్ .. వేడుక చూద్దాం



విద్యుత్ దీపాలంకరణలో మోదకొండమ్మతల్లి ఆలయం

- నేడు మోదమ్మ తీర్థ మహోత్సవం
- విద్యుత్‌దీపాలంకరణలో అమ్మవారి ఆలయం
- పూర్తయిన ఏర్పాట్లు
- తరలిరానున్న భక్తజనం



పాడేరులోని మోదకొండమ్మతల్లి

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సంక్రాంతి పండగలో భాగంగా నిర్వహిస్తున్న ఒకరోజు తీర్థమహోత్సవానికి, ఆలయ కమిటీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులంతా ఘనంగా ఏర్పాట్లు చేశారు.ఇందులో భాగంగా మోదకొండమ్మతల్లి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు విద్యుత్ లైట్లు అలంకరణతో పండగ శోభ నెలకొంది.



విద్యుత్ దీపాలతో మిరిమిట్లుగొలుపుతున్న ఆలయ ప్రాంగణం

వేకువజాము నుంచి పూజలు

మోదకొండమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచే పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, సభ్యులు తెలిపారు.

ఆలయ కళ్యాణమండపం ప్రాంగణంలో ఉదయం 10గంటల నుంచి ముగ్గుల పోటీలు జరుగుతాయని, మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందని పేర్కొన్నారు.

సాయంత్రం ఐదు గంటల నుంచి మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని పాడేరు పురవీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగిస్తామన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని వారు కోరారు.

పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి , పీవో సింహాచలం, ప్రజాప్రతినిధులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిరీష, ఐటీడీఏ పీవో సింహాచలం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పీవో సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మి, వంశీ, ఎంపీడీవో శ్రీనివాసదొర, సర్పంచ్ ప్రసాద్, తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలి



కొత్తపల్లి జలపాత ప్రాంతాన్ని సందర్శించిన ఎస్ఐ షణ్ముఖరావు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాత ప్రాంతాలను ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బందితో శనివారం సందర్శించారు. కొత్తపల్లి జలపాతానికి వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జలపాతం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జలపాతం పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులను ఆయన ఆదేశించారు. ఈ ప్రాంతంలో వాహనాల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేట్టాలన్నారు. కొత్తపల్లి జలపాతం సమీపంలోని బస్సులు, కార్లు, వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట జలపాతం సూపర్‌వైజర్ అభి, రాజు తదితరలున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



కొండాయిగూడెంలో నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కూనవరం: వరద బాధితులు నిత్యావసరాలను సద్వినియోగం చేసుకోవాలని గుడ్‌లైఫ్ మినిస్ట్రీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు శ్యామ్‌గుంటి లూక్‌జాన్సన్ అన్నారు. మండల పరిధిలోని కొండాయిగూడెంలో గత వరదల్లో ఇబ్బందులు పడ్డ బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ లైఫ్ మినిస్ట్రీ సహకారంతో చైతన్య రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ మూడేళ్లుగా పలు ప్రాంతాల్లో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా వరద ముంపు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కంటి పరీక్షలు ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్ రేకులు, 15 మందికి చిన్న దుకాణాలు ఏర్పాటుకు ఆర్థిక సాయం చేసినట్టు తెలిపారు. ప్రభాకర్, పాస్టర్ ప్రేమ్‌సాగర్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అరకులోయ నాలుగురోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

- గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛత దివస్
- పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు



ముంచంగిపుట్టులో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి డీడీ రజని



గంగవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది



డుంబ్రిగుడ ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

అరకులోయ టౌన్: జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, పోలీసు స్టేషన్ల ప్రాంగణంలోని, ఇతరత్రా ప్రదేశాల్లో చెత్తను తొలగించారు. పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు తదితరులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించేందుకు సహకరిస్తామని గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేశారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అరకులోయలో పెదలబుడు ఈఓ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రుక్మాంగధర్ రావు, సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ ఆనందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ, మండల ప్రత్యేకాధికారి రజని మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని కోరారు. ఏవో శ్రీనివాసుబాబు, ఈవోపీఆర్డీవో చిన్నాన్న తదితరులు పాల్గొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నందు, సర్పంచ్‌లు వెంకటరావు, శారద, ఈవోపీఆర్‌డీ విజయ్, వైద్యాధికారి అంబికా రమణి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డేవిడ్‌రాజ్ , సర్పంచ్ రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఏపీవో కొండబాబు తదితరలు పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఓ శ్రీనివాసరావు,.స సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు దార లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పీజీ రామకృష్ణ, ఎంఈవో మల్లేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు చిన్నారావు, వీఆర్వో వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి , సర్పంచ్‌లు ఆదినారాయణ, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, సర్పంచ్ చిట్టెమ్మ, వైస్ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్ ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది



జి.మాడుగులలో పోలీస్‌స్టేషన్ ఆవరణాన్ని శుభ్రపరుస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బంది